క్లుప్తంగా

వైభవంగా గొబ్బి ఉత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న గొబ్బి దేవత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం సందర్భంగా గొబ్బి దేవతకు సోమవారం వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అలంకార మండపంలో అమ్మవారికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రోచ్చరణలు, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని చప్పరంపై అధిష్టింపజేశారు. అనంతరం నాలుగు మాడవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

నారాయణవనం: విద్యుత్ ఆపరేషన్ పుత్తూరు డివిజన్‌లోని మండలాలకు మంగళవారం ప్రత్యేక విద్యుత్ లోక్ అదాలత్‌ను పుత్తూరు ఆపరేషన్ డివిజనల్ కార్యాలయంలో డీఈ చిన్నరెడ్డెప్ప ఆధ్వర్యంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ జయప్రకాష్ బాబు తెలిపారు. మండలంలోని గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ఫిర్యాదు రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

అన్నింటా రాణించాలి

బుచ్చినాయుడుకండ్రిగ: విభిన్న ప్రతిభావంతులు సకలాంగుల వలే అన్నింటా రాణించాలని ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక జెడ్పీ హైస్కూలు ఆవరణలోని భవిత కేంద్రాన్ని సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం నెరిబైకండ్రిగ గ్రామ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. జిల్లా ప్లానింగ్ కో– ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఎంఈఓ రవీంద్రనాథ్, ఐఈఆర్‌టీఆర్ అయ్యప్ప, టీచర్లు పాల్గొన్నారు.

స్కూళ్లకు చేరిన ట్యాబ్‌లు



ట్యాబ్‌లను అందజేస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థుల కోసం ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలలకు ట్యాబ్‌లు చేరాయని ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. సోమవారం ఆయన కల్లివెట్టు జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను అందజేసి మాట్లాడారు.

మమ్మల్ని రెగ్యులరైజ్ చేయరూ!

- సమగ్ర శిక్ష విభాగం ఉద్యోగుల వినతి

సత్యవేడు: ఎంఈఓ కార్యాలయంలోని సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న తమను రెగ్యులరైజ చేయాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు మాట్లాడారు. కార్యక్రమంలో పి.చెంగమ్మ, స్వాతి, రామారావు, మునస్వామి, అపర్ణ, పుష్పలత, జి.వాసు, ఎస్.యువరాజ్, మునిబాబు పాల్గొన్నారు.

కోలాహలంగా 'క్రిస్మస్ కేరల్స్'



రేణిగుంట : మండలంలో జీవగ్రామంలోని సెయింట్ లూక్ లూథరన్ చర్చి పాస్టర్ రెవరెండ్ లూథర్ బాబు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు క్రిస్మస్ కేరల్స్ కోలాహలంగా నిర్వహించారు. చర్చికి వచ్చే క్రైస్తవ కుటుంబాల ఇళ్లకు ఊరేగింపుగా వెళ్లి ప్రార్థనలు చేసి, వారికి క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పడం కేరల్స్ ప్రత్యేకత. చర్చిలో ప్రార్థనలు చేసి పాస్టర్ కేరల్స్‌ను ప్రారంభించారు. అక్కడ నుంచి బాలాజీనగర్, గంగుంట, తూకివాకం, రేణిగుంట, తిరుపతి, విజయనగరంలోని చర్చి సభ్యుల ఇళ్లకు వెళ్లి ప్రార్థనలు చేశారు. కీర్తనలు ఆలపించి క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పారు. కేరల్స్‌లో శాంటాక్లాజ్ (క్రిస్మస్ తాత) వేషధారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రాత్రి 10.30 గంటలకు తిరిగి చర్చి వద్దకు చేరుకున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభించిన కేరల్స్ సోమవారంతో ముగిసిందని పాస్టర్ చెప్పారు. కార్యక్రమంలో లిడియా ఉమెన్స్ సమాజం సభ్యులు, లూథరన్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ సభ్యులు, సండే స్కూల్ చిన్నారులు, సంఘ సభ్యులు దాదాపు వందమంది పాల్గొన్నారు.

జానీబాషాకు నివాళి

శ్రీకాళహస్తి: స్థానిక పురపాలకసంఘ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్ జానీబాషా సోమవారం మృతి చెందారు. ఈయన మృతదేహానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చా డాక్టర్ బత్తెయ్యనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయశేఖర్, శివకుమార్, వెంకటమునీ, శివయ్య, గోపి, నాగూరయ్య, రాఘవరెడ్డి, సురేష్ ఉన్నారు.

శ్రీకాళహస్తి: సమావేశానికి హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న బియ్యపు పవిత్రారెడ్డి



పేదల ఆరోగ్యమే జగనన్న ధ్యేయం

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపుపై హర్షం

శ్రీకాళహస్తి: పేదవారికి కార్పొరేట్ వైద్యం అందించాలన్న ధ్యేయంతోనే జగనన్న ఆరోగ్యశ్రీని మరింత పటిష్టంచేసి రూ.5లక్షలు నుంచి రూ.25లక్షలకు పెంచారని ఎమ్మెల్యే కుమార్తె పవిత్రారెడ్డి అన్నారు. తాడేపల్లి గూడెంలో ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచుతూ లాంఛనంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన కార్యక్రమాన్ని వైద్య, పురపాలకసంఘ సిబ్బందితో కలిసి పవిత్రారెడ్డి భాస్కరపేట చాముండేశ్వరి ఆలయం నుంచి వీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జనవరి 1 నుంచి జగన్న సురక్ష ఫేజ్–2 ప్రారంభం అవుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులను కూడా ఇంటికే పంపిణీ చేస్తారని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్‌తో అనుసంధానం చేసి మరిన్ని మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. అనేక సంస్కరణలు తెచ్చిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. నాడు–నాడు లో భాగంగా శ్రీకాళహస్తి ఆస్పత్రి అత్యాధునికంగా వైద్యశాలగా రూపొందుతోందన్నారు. జనవరిలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులి రామచంద్ర, సుమతి, పురపాలక, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఖరీదైన వైద్యం..పేదలకు దరికి..

సత్యవేడు: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25లక్షలకు పెంచి పేదలకు ఖరీదైన వైద్యాన్ని సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత చేరువ చేశారని మండల వైఎస్సార్ కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సీఎం తన క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సును ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. వారు మాట్లాడుతూ, పేదల ఆరోగ్య కోసం ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని 2,513 హాస్పిటళ్లకు విస్తరించిందని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం కాగానే 1000 రూపాయలు దాటిన అన్ని కేసులను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చారన్నారు. రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఎంపిక చేసిన హాస్పిటళ్లలో సైతం వైద్య సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కే.చంద్రశేఖర్, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ కే.రవి, పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్, ఎంఈఓ–2 ఉష, పంచాయతీరాజ్ ఏఈ దేవిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భానుప్రకాష్, దాసుకుప్పం పీహెచ్‌సీ ఎంల్‌పీహెచ్‌ఓ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురంలో..

కేవీబీపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25లక్షలకు పెంచుతూ తన క్యాంపు కార్యాలయం నుంచి చేసిన ప్రసంగాన్ని మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులు వీక్షించారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గవర్ల కృష్ణయ్య మాట్లాడారు. ఎంపీడీఓ రామచంద్ర, తహసీల్దార్ శ్రీదేవి, నేతలు నందకుమార్, రామ్మోహన్, రమేష్, కేవీబీపురం, కోవనూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు, వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ : వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ సాయి లహరి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్య, సచివాలయాల సిబ్బంది, గ్రామ కార్యదర్శులరే వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీపై అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైద్యాధికారిణి మాధవి, ఏఓ త్రివిక్రమ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.







సత్యవేడు : సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, కేవీబీపురంలో.., బుచ్చినాయుడుకండ్రిగ : మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిలహరి

రామేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే



రామేశ్వరంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి: శబరిమల యాత్రలో భాగంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సోమవారం జ్యోతిర్లింగాల్లో ఒకటైన రామేశ్వరంలో శ్రీరామనాథేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ఉన్న 22 పుణ్యతీర్థాల్లో స్నానం ఆచరించారు. తన మిత్రుడు రామనాథపురం ఎమ్మెల్యే కథర్బాచ ముత్తు రామలింగంతో కాసేపు సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



మధుసూదన్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న రామనాథపురం ఎమ్మెల్యే

ఘనంగా సెమీ క్రిస్మస్ ర్యాలీ

శ్రీకాళహస్తి: పట్టణంలో శ్రీకాళహస్తి పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సెమీ క్రిస్మస్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌ను ఉంచి వీఎంసీ హాల్, పట్టణ పురవీధుల్లో పానగల్ అర్చీ వరకు ఈ ర్యాలీ చేరింది. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ పట్టణ ప్రజల సంక్షేమం కోసం ఏసుక్రీస్తును ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు జీవమణి, అధ్యక్షులు పాస్టర్ ఆంబ్రోస్, కార్యదర్శి పాస్టర్ జోసెఫ్, ఉపాధ్యక్షులు పాస్టర్ మణిబాబు, కోశాధికారి పాస్టర్ జోసెఫ్, ఉప కార్యదర్శి పాస్టర్ ఎలీషా, పాస్టర్లు రఫేల్, విజయకుమార్, లుకా సేమ్‌పాల్, యెహోను, మోజెస్, లూకా, ఇమ్మానియేల్, డేనియల్, ప్రసాద్, తిమోతి, ప్రేమ్‌సుందరం, సాల్మన్, రాజేంద్రప్రసాద్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

కార్మిక పోరాటాలను ఉధృతం చేస్తాం

శ్రీకాళహస్తి: దీర్ఘకాలిక సమస్యల సాధనకు కార్మిక పోరాటాలను ఉధృతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా నిర్మాణ బాధ్యులు నాగసుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో రెండో రోజు సోమవారం ఏఐటీయూసీ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలు నిర్వహించారు. కేంద్ర, ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో మురళి, రాధాకృష్ణ, జనమాల గురవయ్య, శ్రీరాములు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన



పనులను పర్యవేక్షిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రసన్న వరదరాజ స్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి రోజున వరదరాజస్వామి ఆలయానికి భక్తులు తరలివస్తారని చెప్పారు. భక్తుల తాకిడికి తగినట్లు పటిష్టమైన క్యూలు ఏర్పాటు చేయాలన్నారు.

తెరచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

కేవీబీపురం: వారం రోజులుగా మూతబడిన అంగన్‌వాడీ కేంద్రాలు సోమవారం నుంచి యథావిధిగా ప్రారంభమయ్యాయి. సమస్యల పరిష్కారం పేరిట మండల ంలోని 61 అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లు విధులు బహిష్కరించడంతో ఇవన్నీ మూత పడ్డాయి. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో 40కి పైగా అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం నుంచి అధికారులు ప్రారంభించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టారు. వివిధ కారణాలతో తెరవని సుమారు 20 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ రామచంద్ర రంగంలోకి వాటిని తెరిపించారు. తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలతోనే కేంద్రాలను తెరుస్తున్నామని, తమ సిబ్బందిని ఎక్కడైనా ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. ఎంపీడీఓతో పాటు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కల్పలత మండలంలోని ప్రతి సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.



అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని పెడుతున్న సిబ్బంది, సూపర్‌వైజర్

ముదిరాజ్ సంఘ పెద్దల దాతృత్వం



బాండు అందజేస్తున్న సంఘం నాయకులు

శ్రీకాళహస్తి: ముదిరాజ్ సంఘం నాయకులు దాతృత్వాని చాటుకున్నారు. పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధికి చెందిన కొప్పాల ఎల్లయ్య ముదిరాజ్ (35) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి ముదిరాజ్ సంఘం తరపున పెద్దలు ఆయన కుమార్తె రేణుకభాను పేరు మీద రూ.35వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ బాండును కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షులు వల్లమ కన్నయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వైవీ రమణయ్య, గౌరవాధ్యక్షులు పిల్లారి బత్తినయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

పిచ్చాటూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సోమవారం ఇంటర్ విద్య రీజినల్ అధికారి ప్రభాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో భద్రత, వసతులపై అక్కడే ఉన్న శ్రీధర్ ద్వారా ఆరా తీశారు. చుట్టుపక్కల ఉన్న 8 జూనియర్ కళాశాలల విద్యార్థులు ఈ కేంద్రంలో పరీక్షలు రాసేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ యుగంధర్ రాజు, హెచ్ఎం గిరిప్రకాష్ టీచర్లు పాల్గొన్నారు.



జెడ్పీ హైస్కూల్‌ను పరిశీలిస్తున్న ఇంటర్ విద్య రీజినల్ అధికారి ప్రభాకర్ రెడ్డి

భగవద్గీత పారాయణంలో ప్రవాసిని ప్రతిభ

శ్రీకాళహస్తి: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని కొత్తపట్టణం శ్రీ చిన్మయ శారద తపోవనం ఆశ్రమంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి భగవద్గీత పారాయణం(చిన్మయ గీతా చాన్టింగ్ కాంపిటీషన్) పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణం వెలంపాళెంకు చెందిన ఎం.ప్రవాసిని రెండవ స్థానంలో నిలిచింది. చిన్నారికి జ్ఞాపిక, సర్టిఫికెట్, రూ.8 వేలు నగదును అందజేశారు. పలువురు చిన్నారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్మయ అరణ్యం కాంప్లెక్స్ ఇన్‌చార్జి షీలానంద మాతాజీ, కడప ఆశ్రమ ఇన్‌చార్జి స్వామి తురియానంద స్వామి, సిద్ధిపేట ఇన్‌చార్జి బ్రహ్మచారిణి ఉష చైతన్యజీ, హేమసాయిరాం దంపతులు పాల్గొన్నారు.



బహుమతి అందుకుంటున్న ప్రవాసిని

భక్తిప్రపత్తులతో ఆరాధనోత్సవాలు



చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులు

పిచ్చాటూరు: పిచ్చాటూరులో సోమవారం భక్తిప్రపత్తులతో త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడు జి.నాగరాజు మాట్లాడుతూ, ధనుర్మాసంలో ప్రతి ఏటా శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని చెప్పారు. ఉదయం స్థానిక మలయపెరుమాళ్ ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామికి అభిషేక పూజల అనంతరం త్యాగరాజు, పురంధరదాసు, ముత్తుస్వామి దీక్షితుల చిత్రపటానికి ఆలయంలో పూజలు చేసి ఊరేగించారు. సాయంత్రం స్థానికంగా ఉన్న ఎంకేటీ కళ్యాణ మండపంలో మంగళంపాడు ఎన్.శివ, ఏ.కార్తిక్, ఎన్.ఆర్ కణ్ణన్, ఆనంద్ నాదస్వర కచేరి, పి.దశరథ, వేణుగోపాల్, గణపతి, గణేష్ తదితరులు డోలు కచేరి నిర్వహించారు. పలు త్యాగరాజు కీర్తనలు ఆలపించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ డి.ఇళంగోవన్ రెడ్డి అన్నదానం చేశారు. పుత్తూరు, తిరుపతి పరిసర ప్రాంతాలతో పాటు తమిళనాడు నుంచి సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద సోమవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు..వెంకటగిరికి చెందిన రాంమోహన్(43), శ్రీరామ్(35) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళుతుండగా ఇసుక తాగేలి బీసీ కాలనీ వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసుదర్యాప్తు చేస్తున్నారు.

సుదర్శనరెడ్డికి నివాళి

నారాయణవనం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి సేవలను మరువలేనివని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం నారాయణవనంలోని సుదర్శనరెడ్డి నివాసంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు, శ్రీశైలం ఆలయ ట్రస్ట్ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు సుదర్శనరెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఆయన సేవలను స్మరించారు. 40 ఏళ్ల సుదీర్ఘ కాలం ఆయనతో కలిసి పనిచేశానని ఎమ్మెల్యే జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. ఆయన లేని లోటును పూడ్చలేమన్నారు. సుదర్శనరెడ్డి కుమారులు ఎంపీపీ దివాకర్‌రెడ్డి, సుదాకర్‌రెడ్డిని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే, స్థానిక గ్రామ చావడి వద్ద వైఎస్సార్ పార్టీ శ్రేణులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అభిమానులు సుదర్శనరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. పార్టీ నాయకులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సుదర్శనరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

శానిటరీ నాప్కిన్స్ పంపిణీ



నాప్కిన్స్ అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బీసీ ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థులకు మన సంస్కృతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేశారు. ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ కె.పార్థసారథిరెడ్డి మాట్లాడారు. బీజేపీ మహిళా మోర్చా కో కన్వీనర్ తేజోవతి, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, హాస్టల్ సిబ్బంది సుభాషిణి, హేమలత, ఆనందరావు పాల్గొన్నారు.

రాధా రంగా మిత్రమండలి కమిటీ నియామకం

శ్రీకాళహస్తి: రాధారంగా మిత్రమండలి నియోజకవర్గ అధ్యక్షులు సిద్ధులుగారి ప్రసాద్, పట్టణాధ్యక్షులు పి.ప్రతాప్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణ కమిటీని నియమించారు. ప్రధాన కార్యదర్శిగా కె.అనిల్‌కుమార్, సహాయ కార్యదర్శిగా మధురా సతీష్‌కుమార్, కోశాధికారిగా ఎస్.సుధాకర్, పట్టణ స లహామండలి సభ్యులుగా పగడాల సుధాకర్, పాపిశెట్టి వెంకటప్రసాద్‌ను పర్వతాల నవనీతయ్యను నియమించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌నాయుడు, మోహన్ రావు, కొట్టిడి మధుశేఖర్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో టెన్త్ విద్యార్థులు, టీచర్లు

నారాయణవనం: పదవ తరగతి విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మీప్రసాద్ విద్యార్థులకు అందజేశారు. ఆంగ్ల మాధ్యమంలో మెటీరియల్‌ను రాష్ట్రంలోని నిష్ణాతులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు రూపొందించారని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు దాసరి మునెయ్య చెప్పారు. అన్ని సబ్జెక్టులను సులభంగా నేర్చుకుని, ఎక్కువ మార్కులు సాధించేలా మెటీరియల్‌ను రూపొందించారని పేర్కొన్నారు. విద్యాసామర్థ్యాలపరంగా వెనుకబడిన విద్యార్థులు కూడా సులభంగా పాస్ కావడానికి ఇది ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని ఇన్‌చార్జి హెచ్‌ఎం పేర్కొన్నారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం

శ్రీకాళహస్తి: పేదల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని 30వ వార్డు పరిధిలోని సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 30వ వార్డు పరిధిలో రూ.19.77కోట్లు అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ నారాయణరెడ్డి, నాయకులు బుజ్జిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మధురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, హేమంత్, కార్తీక్ పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం

ఏర్పేడు: పేదల సంక్షేమమే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్ అన్నారు. మండలంలోని కొత్తవీరాపురంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ముందు జెండా ఆవిష్కరణ చేసి వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డును ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై చేకూరిన లబ్ధిని గ్రామస్తులకు వివరించి కరపత్రాలు అందజేశారు. అనంతరం రాత్రి పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్ధన్ యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు, దామోదరం రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే జనరంజక పాలన

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందాలంటే జగనన్న తిరిగి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు వయ్యాల కష్టారెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం యార్లపూడిలో సోమవారం జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మల్లి, రామిరెడ్డి, చలపతి, నరేష్ రెడ్డి, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి

కేవీబీపురం: భావితరాల భవిష్యత్తుకోసం మళ్లీ జగనన్నే రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గవర్లకృష్ణయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని రాయపేడు సచివాలయంలో నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ రూపేణా రాయపేడు గ్రామ ప్రజలకు చేకూరిన లబ్ధిని కృష్ణయ్య వివరించారు. అనంతరం పథకాల లబ్ధి వివరాల డిజిటల్ బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, ముఖ్యనేతలు నందకుమార్, లాల్‌బాబుయాదవ్, మాధవీరెడ్డి, డేవిడ్, ఎంపీడీఓ రామచంద్ర, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







ఏర్పేడు: కరపత్రాలను అందజేస్తున్న రమణయ్య యాదవ్, శ్రీకాళహస్తి : సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, తొట్టంబేడులో..